# పెళ్ళి చెడగొట్టి చూడు

కె. గోదావరి శర్మ

సాయంకాలం అయిదున్నర అవుతూండగా యథాప్రకారం వచ్చి కూర్చున్నాడు విశ్వేశ్వరంగారు.

నిన్న ఊళ్ళో లేడు కాబోలు, రాలేదు.

విశ్వేశ్వరంగారు ఇలా అప్పుడప్పుడు హఠాత్తుగా మాయం కావడం, మర్నాడో, మూడోనాడో ప్రత్యక్షమై తనెక్కడికి వెళ్ళిందీ, ఏం సాధించుకొచ్చిందీ వివరంగా పూస గుచ్చినట్టు నాతో చెప్పడం మామూలే.

ఈసారి ఏదో ఘనకార్యమే సాధించుకొచ్చినట్టున్నాడు. మొహం వెలిగిపోతూంది-ఆనందంతోనూ, ఆత్మ సంతృప్తితోనూ. విశేషం ఏదో వెంటనే నాతో చెప్పెయ్యాలని మహా ఉబలాటంగా ఉన్నట్టుంది. అలా నాతో చెప్పి నాచేత తన లౌక్యాన్ని, ప్రయోజకత్వాన్ని, అనుభవం వల్ల వచ్చిన తెలివితేటల్నీ పొగిడించుకోవడం ఆయనకి చాలా ఇష్టం. ఆ బలహీనత నాకు తెలుసు. నేను ఆయన్ని అసంతృప్తి పరచను. నాకు అదో సరదా. నేను ఆయన గొప్పతనాన్ని గుర్తించినవాణ్ణి కావడంచేత ఆయనకి అభిమానపాత్రుడినయ్యాను. అంచేత నాక్కూడా తరచు ఉదారంగా ఉచిత సలహాలిస్తుంటాడు, తన వయస్సునీ, అనుభవాన్నీ పురస్కరించుకుని. ఆ సలహాలు నేను ఈ చెవితో విని, ఆ చెవితో వదిలేసినా పెద్దగా బాధపడడు. పాపం పెద్ద ముండావాడు!

మా ఇద్దరి మైత్రీ విలక్షణమైనది. ఉపమించాలంటే సమాన ధర్మం ఏదీ లేదు మా ఇద్దరిలో. కాని కలిశాం, విచిత్రంగా. విశ్వేశ్వరంగారు అరవై నాలుగు పూర్తయి అరవై అయిదులో ఉన్న సంగతి అనుక్షణం తాను గుర్తు చేసుకుంటూ, ఇతరులకి గుర్తుచేస్తూ ఉంటాడు. గత అరవై అయిదేళ్ళుగా జీవితాన్ని చదవడం, ఢక్కా మొక్కీలు తినడం వల్ల తాను ఎవరెస్టు శిఖరం మీద కూర్చుని అందరికీ సలహాలివ్వడానికి, అందరిచేతా పూజలందుకోవడానికి అర్హుడని ఆయన ప్రగాఢ విశ్వాసం. మరి ఆయన ముందు నేనేపాటి? నా వయసెంతో ఆయనకెప్పుడూ చెప్పలేదు నేను. కానైతే నా వయసుకి నేను ఉండవలసినదాని కంటె పెద్దవాడిలా కనిపిస్తానని అందరూ అంటారు. వయసెంతైతే ఏం గాని, నా ఉద్యోగమూ, నా 'పెద్దమనిషి' తరహా చూసి తన స్థాయికి తగినవాడినే అని అంగీకరించారు విశ్వేశ్వరంగారు. అంచేత రోజూ సాయంకాలం కాఫీ, కొండొకచో టిఫినూ మా ఇంట్లో స్వీకరించి మమ్మల్ని ధన్యుల్ని చేస్తూంటాడు.

"అదృష్టం అంటే అలా కలిసి రావాలి" అన్నాడు విశ్వేశ్వరంగారు వచ్చి కూర్చుని.

విశ్వేశ్వరంగారు సంభాషణకి ఉపక్రమించే పద్ధతి ప్రత్యేకంగా ఉంటుంది. ఏదో ఒక సామెతతోనో, హాస్యోక్తితోనో, ఒక జనరల్ స్టేట్‌మెంట్‌తోనో ప్రారంభిస్తాడు. అర్థాంతరన్యాస ఆయన అభిమాన అలంకారం కాబోలు!

నేను విధిగా ఆసక్తి కనబరుస్తాను-"ఏమైందీ" అంటూ.

"అవడానికేముంది గానీ..." అనో, "నే చెప్ప లేదూ..." అనో మొదలుపెట్టి విషయమంతా వివరిస్తాడు. రంగస్థలానుభవం ఏమీ లేదు గాని, ఉంటే మటుకు ఆ ఆంగికం, ఆ వాచికం, ఆ హావభావ ప్రదర్శనతో గొప్ప నటుడై ఉండేవాడు.

నేనూ యథాశక్తి, "కాదు మరీ", "అదేమన్న మాట", "అయ్యోయ్యో, రోజులు ఇలా ఉన్నాయి మరి" ఇత్యాది సమిధలతో ఆయన వాగ్జ్వాల నెగసన తోస్తూంటాను.

ఆయన గంటన్నరా, రెండు గంటల సేపు సుదీర్ఘ సుత్తి వేసి, కాఫీ పుచ్చుకుని, జరిగినదాని మీద నా అభిప్రాయాలూ, వ్యాఖ్యలూ విని సంతోషించి, చివరికి 'మన తరవాత ఈ లోకాన్ని ఆ భగవంతుడే కాపాడాలి' లాంటి ఉపసంహార వాక్యాలతో శలవు పుచ్చుకుంటాడు. ఆయన్నటు పంపించి అప్పుడు నేను క్లబ్బుకో, బజారుకో బయలుదేరుతూ ఉంటాను.

ఇవాళ కూడా మామూలు అలా వరుసలలో కార్యక్రమం మొదలైంది. "ఎవరి సంగతి?" అన్నాన్నేను కుతూహలం కనబరుస్తూ.

"అదే-శ్రీనివాసరావని నే చెబుతుంటాను చూడండి, మా చిన్న బావమరిది కొడుకు. ఆఖరి వాడు..."

"ఆ, ఆ" అన్నాన్నేను ఆ వ్యక్తి ఎవరో వెంటనే గుర్తు రాకపోయినా.

"వాణ్ణి మా వూరే వేశార్ట. డిప్యూటీ కలెక్టరుగాను! ఐ.ఎ.ఎస్. పేసయ్యాడుగదా మరి!" అన్నాడాయన ఆనందంగా.

ఇప్పుడు నాకు గుర్తొచ్చింది సదరు శ్రీనివాసరావు ఎవరో. విశ్వేశ్వరంగారికి స్వంత మేనల్లుడు కాదు గానీ, ఎక్కడో దూరపు బంధుత్వం. గత సంవత్సరం ఆ కుర్రవాడు ఐ.ఎ.ఎస్.లో సెలక్టయినప్పుడు తన కొడుకే సెలక్టయినంత హంగామా హడావుడీ చేశాడీయన. ఎలా మరిచిపోతాం?

"అలాగా" అన్నాను నేను నాకు చేతనయినంత వరకు ఆనందాన్ని ప్రదర్శిస్తూ.

"ఇంతకీ...అది కాదు అసలు విశేషం" అన్నాడాయన కుర్చీలో కాస్తంత ముందుకు వంగి. ఆయన ముఖం చూస్తుంటే 'బీమింగ్ విత్ జోయ్' అన్న ఆంగ్ల ప్రయోగం గుర్తొచ్చింది నాకు.

ఆ అసలు విశేషం ఏమిటో వినడానికి నేనూ సిద్ధపడి సర్దుక్కూర్చున్నాను ముఖంలో కుతూహలం కనబరుస్తూ.


"ఐ.ఎ.ఎస్. పేసయినవాడికి డిప్యూటీ కలక్టరు రావడం గొప్పేముంది? ఎక్కడో అక్కడ వెయ్యాలి కాబట్టి మనూర్లో వేశారు..." సింపుల్‌గా తేల్చి చెప్పేడు. ఆయన అసలు విషయాన్ని ఇంకా వెనక్కే ఉంచి ఊరిస్తూ.

కాఫీ వచ్చింది.

"మరే" అన్నాన్నేను, కాఫీ గ్లాసందుకుంటూ. ఆయన వేడుక నే నెందుకు కాదనడం? అలా అసాధారణ విషయాల్ని కూడా సాధారణంగా చప్పరించెయ్యడం ఓ గొప్ప. ఆయన మనవడికి లెక్కల్లో నూటికి నూరు వస్తాయి. ఆ విషయం మనతో చాలా కేజువల్‌గా చెప్తాడు. చెప్పకుండా మానడు. చెపితే మనం విని ఆశ్చర్యపోవాలి. "అబ్బా, సెంట్ పర్సెంట్ అన్నమాట! మీ ట్రెయినింగు మరి" అనాలి. అంటే దానికి ఆయన తీసి పారేస్తూ, "ఆ లెక్కల్లో నూటికి నూరు రాకపోతే ఎలాగండీ? రాకపోతే తప్పుగాని వస్తే గొప్పేముంది?" అంటాడు గర్వాన్ని దాచుకుంటూ. దానితో మనం ఆయన 'స్థాయి'ని గుర్తించి, "ప్రతి ఇంట్లోనూ మీ వంటి అనుభవజ్ఞులూ, పెద్దలూ ఉంటే దేశం ఏనాడో బాగుపడేది" అనో, అలాంటి మాటలతోనో ఆయన్ని ప్రశంసించాలి. అపుడాయన

అనుగ్రహించి ఇనుమడించిన ఉత్సాహంతో విద్యా ప్రమాణాల గురించి, యువకుల్లో క్రమశిక్షణారాహిత్యం గురించి, పెద్దల యెడల వినయ విధేయతలు లోపించడం గురించి, ఆయన చిన్నప్పుడు ఎంత ఆదర్శవంతంగా ఉండేవాడో, తరవాత్తరవాత దేశం ఎంత చెడిపోయిందో-ఇత్యాది అంశాల గురించి ఉపన్యసిస్తారు. నాకేమో ఆయన 'నేటి'ని 'టకిల్' చేసి, స్తుతి చేసి, సుత్తి వేయించుకునే సరదా, దురదా ఎక్కువే మరి!

వెనక ఆ శ్రీనివాసరావు ఐ.ఏ.ఎస్.కి సెలక్టయినప్పుడు ఈయన హడావుడి చూడాలి! "అసలు నేను చిన్నప్పటి నుంచీ గమనిస్తున్నానండీ వాడిని! వీడు పెద్దయితే ఏ కలెక్టరో అవుతాడు గాని చిన్న చిన్న ఉద్యోగాలు చెయ్యడని అప్పటినుంచి చెపుతున్నాను వాడి నాన్నకి! అసలు వాడికి ఐ.ఏ.ఎస్. రాయమని సలహా ఎవరిచ్చారనుకుంటున్నారు? మా చిన్న బావమరిది సంగతి మీకు తెలీదులెండి. మంచివాడే గాని మేదకుడు. కుర్రాణ్ణి కలెక్టరు చెయ్యవయ్యా అంటే మన కుటుంబాల్లో మనం అంతెత్తుకి సాగగలమా అనేవాడు. వాడు వాళ్ళ నాన్న మాట విని ఉంటే ఏ కాలేజీలోనో లెక్చరరుగా అఘోరిస్తూ ఉండేవాడు. 'ఒరే, నువ్వు తెలివైన




వాడివి. ఐ.ఏ.ఎస్.కి వెళ్ళు, తప్పకుండా సెలక్టవుతా'వని నేను చెవిలో ఇల్లు కట్టుకుని పోరబెట్టేకదా..." అన్నాడు. ఆ కుర్రాడు సెలక్టవడంలోని క్రెడిట్ అంతా తనే గుత్తకి తీసుకుంటూ.

"అసలు వాడికి ఎలా వచ్చిందో గాని మా నాన్నగారి పోలిక వచ్చింది" అని కూడా చెప్పేడు విశ్వేశ్వరంగారు. అదెలాగో నాకు బోధపడలేదు. తుంటిని కొడితే పళ్ళు రాలినట్టుందని మనసులో అనుకుని, "ఆహా, అలాగా" అని ఆశ్చర్యాన్ని ప్రదర్శించాను.

"మరేమిటనుకున్నారు? ఈమధ్య సైంటిస్టులు కూడా చెపుతున్నారట, అమెరికాలోనూ అక్కడాను! జీన్లని ఉంటాయి, అవి దగ్గర బంధుత్వం, దూరపు బంధుత్వం అని లేకుండా ఎవరినుంచయినా సంక్రమిస్తూ ఉంటాయట. మరి ఆ జీన్లని బట్టేకదా పోలికలు! అయినా దూరం ఎక్కడ? మా నాన్నగారూను, మా చిన్న బావమరిది తండ్రినీ స్వయానా పినతండ్రి పెత్తండ్రి పిల్లలు కాదూ? అలా వచ్చింది పోలిక" అని విశదీకరించాడు.

"అదన్నమాట సంగతి" అని తాళం వేసేను నేను.

"మా నాన్నగారంటే ఇక చెప్పేదేముంది? తాసిల్దారుకదా! ఎక్కడికి కమాను వెళ్ళేరంటే అక్కడంతా గజగజ! అలా అంత దూరంలో ఉంచేవారు ఎవరినైనా! అసలు కలెక్టరు దొరవారే ఎంతో గౌరవించి మాట్లాడే వారట మా నాన్నగారితో! మేం మాత్రం? ఆయన ఇంట్లో ఉన్నారంటే ఇల్లంతా ఊపిరి బిగబట్టుకుని




ఉండేవాళ్ళం. మండువా దాటితే నడవాలో గొలుసులతో కట్టిన ఉయ్యాల మంచం ఉండేది. దాని మీద నడుం వాల్చి తల కింద చెయ్యి పెట్టుకుని ఆయన ఊరివాళ్ళ అర్జీలు వింటూ ఉంటే—శేషతల్పం మీద శ్రీమన్నారాయణుడు దేవతల మొరాలకిస్తున్నట్టే ఉండేది! వచ్చిన వాళ్ళంతా వట్టి చేతులతో వచ్చేవాలా మరి? వడ్లంటే మాకు పండేవి గానీ, ఉప్పుతో సహా తొమ్మిదీ సప్లయిలే కాదూ? ఇంటికి వచ్చేవాళ్ళూ, వెళ్ళే వాళ్ళూ, మూటలు తెచ్చేవాళ్ళూ, పట్టుకువెళ్ళేవాళ్ళూ—ఓహో, ఇల్లంటే ఇల్లా? అన్నపూర్ణ సత్రంలా ఉండేది...బంధు జన బాంధవుడని, ఆశ్రిత పక్షపాతి అనీ, భక్త సులభుడనీ చెప్పుకునేవారు తెలుసునాండీ మా నాన్నగారిని! ఆ రోజు లలాంటివి! ఇప్పుడు చూడండి—ఇంటి యజమాని మాట పెళ్ళాం వినదు, పిల్లలు వినరు! ఎవరి మట్టుకి వాళ్ళకే సొతంత్రాలు! డబ్బు గడించి ఇల్లు నిర్వహిస్తున్న మొగాడు ఆడదాని మాటకీ, గుంట వెధవల మాటకీ తల ఒగ్గడం అంటే—కలి కాలం అంటే ఇంతకన్న ఇంకేముంది చెప్పండి...'' ఈ విధంగా సాగింది ఆనాడు విశ్వేశ్వరంగారి ధోరణి.

కాఫీ తాగడం ముగించి, గ్లాసు పక్కన పెట్టి గొంతు సర్దుకున్నాడు విశ్వేశ్వరంగారు. నేనూ ప్రస్తుతంలో పడ్డాను. కాఫీ తాగుతున్నంత సేపూ ఏమీ మాట్లాడ డాయన. ఏకాగ్రతతో అర్ధనిమీలిత నేత్రుడై కాఫీ తాగే ఆనందాన్ని అనుభవిస్తాడు. ఆ సమయంలో ఆయన్ని మనం డిస్టర్బ్ చెయ్యకూడదు.

''మా తమ్ముడి కూతురు లేదూ—అలివేలు? ఆ మధ్య మా ఇంట్లోనే ఏర్పాటుచేసేరు చూడండి, ఎవరో దాన్ని చూస్తామంటేను...'' అని సంభాషణ ఇంకెక్కడో ఎత్తుకున్నాడు.

ఈ రెండు రేఖలూ ఎక్కడ ఖండించుకుంటాయో నాకప్పుడే అర్థమయిపోయింది. అయినా అంతా వివరంగా ఆయన చెపితేనే ఆయనకి ఆనందం. సంభాషణ విషయంలో క్లుప్తతకి బద్ధ విరోధి విశ్వేశ్వరం గారు. మోస్ట్ అన్‌పొయిటిక్ మనిషి. ఎవరితో మాట్లాడుతున్నా ఎదుటి మనిషి అయిదో క్లాసు కుర్రవాడో, తెలుగు రానివాడో, బుర్ర సరిగ్గా పని చెయ్యనివాడో అని భావించి, రెండు రెళ్ళు నాలుగన్న సంగతి విశదంగా, వివరంగా, విపులంగా, సోదాహరణంగా అభినయంతో సహా చెపుతుంటాడు. తను చెప్పేవన్నీ గొప్ప నగ్నసత్యాలనీ, మామూలు మనుషులు వాటిని సరిగా అర్థం చేసుకో లేరనీ ఆయన అభిప్రాయమన్నమాట! కాని ఇటీవలి 'నాలెడ్జి ఎక్స్‌ప్లోజన్' సంగతి ఆయనేమి


## మహిళలకు మా స్వాగతం

వంటింటిలోనే గాక ఇంటా-బయటా ఆర్థిక ప్రణాళికా పథకరచనా ధురీణులు నేటి మహిళలు

వారికి శుచీ-శుభ్రం కావాలి. మేలైన వస్తువులు సరసమైన ధరలకు రావాలి. అన్ని వస్తువులూ ఒకే తావులో దొరకాలి. వారికి తూకం పడికట్టురాయి.

సకుటుంబ సపరివారంతో వాహ్యాళి వచ్చినంత స్వేచ్ఛగా సుళువుగా షాపింగ్ చెయ్యగల ప్రశాంత పరిసరాలు కావాలి.

సరిగ్గా అలాంటిదే మా **సెల్ఫ్ సర్వీస్ షాపు**

అందుకే - అన్నీవున్న ప్రాంగణంలోనికి ఆహ్వానం!

**విజయ కృష్ణ**

# సూపర్ బజార్

మహాత్మాగాంధీ రోడ్ విజయవాడ 520 002 ఫోన్ 75713

Adwise

ఎరగడు. ఇంటర్ చదివే ఆయన మనవడికి ఆయనకన్నా ఎక్కువ విషయాలు తెలుస్తాయని నాకు తెలుసు. అయినా— ఆయన పద్ధతికి నేనెప్పుడూ సిద్ధపడే ఉంటాను కనక, అవకాశం ఆయనకే ఇస్తూ, "ఔనౌను, మరి...ఆ సంబంధం సెటిలయినట్టు లేదే!" అన్నాను.

"పీడా పోయింది! దాని తాత లాంటి సంబంధం నే నిప్పుడు చూస్తున్నానుకదా!" అన్నాడాయన సగర్వంగా.

"అలాగా? ఎవరండోయ్?" అన్నాన్నేను పూర్తి అమాయకతని నటిస్తూ.

ఓయ్ వెర్రివాడా, ఈ మాత్రం పోల్చుకోలేక పోయినావుకదా అన్నట్టు నావేపు సానుభూతిగా చూసి, "మా శ్రీనివాసరావుని మాట్లాడి స్థిరపరిచి వచ్చాను" అన్నాడాయన, ఇక చూస్కో అన్నట్టు తల తాటిస్తూ.

"అసాధ్యులండోయ్ మీరు" అని యథాశక్తి ఆశ్చర్యమూ, ప్రశంసా కురిపించేసేను నేను.

"మరేమిటనుకున్నారు! మనం పథకం వేసేమంటే అలా ఉండాలి మరి!" ముసిముసి నవ్వులు నవ్వుతూ, ఆనందంతో ఉప్పొంగిపోతూ అన్నాడాయన.

"అయితే నిష్యంతా మీరు ఆ పని మీద ఉన్నారన్న మాట. శుభం! అబ్బాయిని కూడా ఒప్పించే వచ్చారా" అడిగేను నేను.

"ఏది? వాడింకా అక్కడికి రాలేదే!" అని, గొంతు కాస్త తగ్గించి కొనసాగించేరు విశ్వేశ్వరంగారు. "అస లందుకే తొందరపడి వెళ్ళేను నేను! వాళ్ళమ్మా నాన్నా నా మాట కాదనరు. ముందు వాళ్ళచేత ఔననిపిస్తే, ఇహ వాడంటారా, వాడు మాత్రం? నేనెంత చెపితే అంత. పెద్దవాళ్ళకి ఎదురు తిరగడం మా ఇంటా వంటా లేదు. అయినా ఏం, తీపి దిగదీసిందా? ఎందుకొద్దంటాడు? మా తమ్ముడికా ఒక్కర్తే కూతురు! కావలస్తే నలభై యాభై వేల దాకా ముట్టచెప్ప గలడు! పిల్లకేం-కన్ను వంకా కాలు వంకా? చదువు కుంది, ఉద్యోగం చేస్తే నెలకి వెయ్యికి తక్కువ లేకుండా సంపాదిస్తుంది...."


"మరి, ఆ మధ్య నైవిక్ ట్రబులేదో..." సందేహాన్ని వెల్లడి చేశాను నేను సంశయిస్తూనే.

"దానికేముందండీ! పెళ్ళయితే అదే సర్దుకునే అవకాశం ఉందని ఆ డాక్టరమ్మ చెప్పిందికదా! ఆ శంక పెట్టుకుని బంగారంలాంటి సంబంధం వచ్చినప్పుడు తిరగ్గొట్టుకుంటామా? అయినా పెళ్ళిచూపుల్లో ఈ మెడికల్ చెప్పులన్నీ ఉంటాయా ఏమిటి మీ వెర్రిగాని! గుప్‌చుప్‌గా కార్యం జరిపించెయ్యడమే! తరవాత స్పెషలిస్టుల దగ్గరికి వెళ్ళి వాళ్ళే నయం చేయించుకుంటారు! ఇలాంటి చిన్న చిన్న విషయాలన్నీ పట్టించుకుంటే ఇంక పెళ్ళిళ్ళవుతాయా?" అన్నారు విశ్వేశ్వరంగారు లౌక్యంగా నన్ను మందలిస్తూ.

"నిజమే లెండి! వెయ్యి అబద్ధాలాడయినా ఓ పెళ్ళి చెయ్యమన్నారందుకే మన పెద్దవాళ్ళు" అన్నాను నేను వ్యంగ్యంగా.

అయితే వ్యంగ్యమూ, ధ్వని మొదలయిన కవిత్వ సామాగ్రికి ఆయనెప్పుడూ ఆమడ దూరంలో ఉంటాడు కాబట్టి, నా గొంతులో వ్యంగ్యాన్ని గుర్తించక, "మరే, మా బాగా చెప్పేరు" అన్నారు.

# తొలకరి



ఇన్నాళ్ళూ అరచేతుల్లో ముఖాన్ని దాచుకుని రోదించాను
ఇన్నాళ్ళూ అపరాధ పంజరంలో చిక్కి కృశించాను
మరణం నాలుగు వైపుల నుంచీ మంట పెడుతుంటే
పరాజయ ఫలం పెదాల్ని పురుగులా కరుస్తుంటే
ప్రతీ ముఖం పొగలు చిమ్మే ద్వేష స్తోత్రంతో ఎదురవుతుంటే
నరక లోకాలన్నిటా అనాథ ప్రేతంగా సంచరించాను
చావులన్నిటిలోకీ దుర్భరమైన చావు పొందాను.

ఇప్పుడు అద్భుతాల్లోకెల్లా అద్భుతాన్ని చూసాను
చిర విరహ రజ్జువుకు బిగిసిన స్వరం
తొలి ఆషాఢ మేఘ దర్శనంతో గొంతు విప్పుకుంది
మోడుబారిపోయిన వృక్షశాఖలపైని
స్వర్గ సీమల పావురాలు వాలి వసంతాల్ని పలికించాయి
శాపాల బరువుకు ఒంగిపోయిన భూమి శిరసుపైన
శతకోటి గంగలు వర్షించాయి

అప్పుడు పాటలన్నిటికన్నా గొప్ప పాట విన్నాను
అన్ని దిక్కుల నుంచీ వెయ్యి వీణలు, వేణువులు మోగాయి
అన్ని అడవుల్లోనూ నెమళ్ళు పింఛాల వింజామరలు వీచాయి
నదులు సెలయేళ్ళు సముద్రాలు పులకరించాయి
తోటలన్నిటి నుంచీ పువ్వులు పలకరించాయి
ఆకాశలోకమంతటా వారుణ దేశ కన్యలు ఒప్పులకుప్పలాడారు
పురిటి గదుల్లోంచి చిన్నారి శిశువులు మృదువుగా నవ్వారు
పద్నాలుగు లోకాల నుంచీ శాంతి దేవతలు మంగళ గీతాలు ఆలపించారు

ఊర్ధ్వ అధోలోకాలు ఒక్కటయ్యాయి
అందమైన కన్యల పారాణి పాదాలపైని మువ్వలల్లే
ఎండలో వానచినుకులు మెరిసాయి
ఉపమాలంకారం ఇప్పుడు సఫలమైంది
ఇప్పుడు దృశ్యం గాయత్రి. శబ్దం గాయత్రి. త్రిలోకాలు గాయత్రి
ఇప్పుడు జన్మలన్నిటిలోకీ సార్థకమైన జన్మ పొందాను.

—వాడ్రేవు చిన వీరభద్రుడు

నేను తల పట్టుకు కూర్చున్నాను.

మరో గంటసేపు అదీ ఇదీ మాట్లాడి, ఆ రోజుకి నాకు విముక్తి ప్రసాదించారు విశ్వేశ్వరం గారు.

* * *

దాదాపు మూడు నెలలు గడిచేయి. ఆ శ్రీనివాసరావు మా ఊరి డిప్యూటీ కలెక్టరుగా ఛార్జి తీసుకోవడం, క్రమంగా మంచి ఆఫీసరుగా పేరు తెచ్చుకోవడం- విశ్వేశ్వరంగారు ఎప్పటికప్పుడు నాకు సవిస్తరంగా చెపుతూనే ఉన్నారు. తరచుగా వెళ్ళి అతన్ని కలుస్తున్నారు. బహుశా అతడికి సలహాలు కూడా ఇస్తున్నాడేమో! అయితే ఇంకా పెళ్ళి విషయం కదిపినట్టు లేదు. "తొందర పడకూడదండీ ఇలాంటి విషయాల్లో మనం! తగిన సమయం రావాలి. ఇంకా ఉద్యోగ బాధ్య తలూ అవీ కొత్తకదా, కానీండి! అయినా మన కళ్ళ ముందు ఉన్నాడు. సమయం, సందర్భం చూసి ఊ అనిపించుకుంటే సరి! వాడి మేలు కోరేవాళ్ళం, పెద్ద వాళ్ళం, మా ముచ్చట వాడు మాత్రం కాదంటాడా?" అన్నాడాయన ఇంకోలా జరగవచ్చున్న అనుమానం

కాలమ్ దాటని కథ


# మరి రేపు!!

నిన్న

"నాన్నా! నా క్లాస్‌మేట్ సూరిగాడ్ని మాస్టారు తెలుగు పుస్తకం తేలేదని కొట్టారు. పాపం వాళ్ళ నాన్న దగ్గర కూడా డబ్బులు లేవట. నా పుస్తకం వాడికిచ్చేస్తా-నాకు వేరేది కొనిస్తావూ' పెదవుల్లోంచి కాక గుండెల్లోంచి వచ్చిన ముద్దులొలికే మాటలతో అన్నాడు ఆరేళ్ళ విశ్వం తండ్రితో.

పార్వతీశంగారు కొడుకుని ఒళ్ళోకి లాక్కుని ముద్దెట్టుకుని మురిసిపోయారు. కళ్ళు చెమర్చగా "నేను గర్వపడుతున్నాను బాబూ నిన్ను చూసి. సూరిగాడికి నేనే కొత్త పుస్తకం కొనిస్తాగా' అన్నారాయన. ఆయన మొదటి వాక్యం అర్థం కాలేదు విశ్వానికి, కానీ రెండోది అర్థమయి ఉప్పొంగి ఒళ్ళో ఒరిగిపోయాడు.

*  *  *



నేడు

'నీ ఫ్రాక్ బావుంది' అంది ఐదేళ్ళ శిరీష ఆరేళ్ళ మంజులతో.

'నా దగ్గర ఇంకోటుందిగా. మరి మమ్మీనడిగి అది నీకిస్తాను వుండు' అంటూ వంటింట్లోకి కుందేల్లా పరుగెత్తుకెళ్ళింది మంజుల.

'మమ్మీ మరేమో మన 'శిరూ'కి ఈ 'ఫ్రాక్' కావాలిట. నాకు రెండు కొన్నావ్‌గా రెండోది శిరూకియ్యనా... ఊ...'' అంటూ తల్లి కొంగు పుచ్చుకుంది.

'కుక్కర్' మీద విజిల్ పెట్టి, కొంగు బొడ్లో దోపుకుని కూతురు చెవి పుచ్చుకుంది వనజ.

'చంపేస్తాను. నీకు కొన్నవన్నీ దానికిచ్చేస్తానంటావ్. రేపట్నుంచి అసలు దాంతో ఆడుకోనే వద్దు' అరిచినంత పని చేసింది వనజ. అప్పుడే అక్కడికి వచ్చిన భర్తతో అంది. 'చూడండి మీ కూతుర్ని పోనీగదా ఆడుకుంటారు అనుకుంటే మీ తమ్ముడి కూతుర్ని నెత్తినెక్కించుకుంటోంది. అసలు వాళ్ళనీ కాలనీలోంచి వెళ్ళిపొమ్మనండి. వెధవ సంత' విసుకుంటూ మొగుడికి దురుపదేశం చేస్తున్న ఆధునిక ఆదర్శమాతని చూస్తూ బిత్తరపోయింది చిన్నారి మంజుల.

—తనికెళ్ళ శంకర్

లేశమూ లేకుండా.

నేను తల ఊపి ఊరుకున్నాను.

*  *  *

ఓ రోజు సాయంకాలం అయిదు గంటలకే ఉరుము పిడుగులా వచ్చి పడ్డాడు. మనిషి చాలా వ్యాకుల చిత్తుడై ఉన్నట్టు ముఖం చూస్తే తెలుస్తోంది.

నేనూ అప్పుడే వచ్చాను. ఆయన వాలకం చూసి విషయం కొంత గ్రహించినా, మామూలుగానే సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టాను.

"ఛీ ఛీ ఛీ! దేశం తగలడిపోతున్నదంటే తగలడి పోదూ మరి? చిన్నా పెద్దా అంతరం లేకపోయాక ఎందుకూ ఆ చదువు?'' అని కూర్చుంటూనే గింజుకున్నాడు.

నేనూ ప్రశ్నార్థకపు మొహంతో ఆయన కెదురుగా కూర్చున్నాను.

"నిజమే! పెద్దవాళ్ళం అన్నాక అంతో ఇంతో చాదస్తమూ ఉంటుంది. తాపత్రయమూ ఉంటుంది. నా బొందో అని ఊళ్ళోవాళ్ళ కోసం రెక్కలు ముక్కలు చేసుకోవడమూ ఉంటుంది. అయితే? మీరు లేరూ? కుర్రవాళ్ళే! మరి నా మాటలు మీకు విషంలా తోస్తున్నాయా? తోస్తే ఇన్నాళ్ళు నన్ను మీ ఇంటికి రానిద్దురా? మేం పాతకాలపు మనుషులమట! మావన్నీ పాతకాలం భావాలట! అసలు ఈ కాలానికి పనికిరాముట మేమూ, మా సలహాలూనూ!''

కోపంతో రొప్పుతున్నారు విశ్వేశ్వరంగారు.

నాకు కొంచెం జాలి వేసింది. అయినా తప్పదు.

"ఇంతకీ ఏమన్నాడు పెళ్ళిమాట?'' అన్నాను దాదాపు నిర్భావంగా.

"ఏమంటాడు? అదృష్టం అందలాలెక్కిస్తే బుద్ధి బురదలోకి లాగిందని వినలేదూ మీరు? ఆఫీసు పనిలోనూ అంతేనట! అందరూ అదే మాట! తన బుద్ధికి ఎంత తోస్తే అంత చెయ్యడమే తప్ప పెద్దవాళ్ళని మంచీ చెడ్డా అడగడమూ, తెలుసుకోవడమూ లేదట! ఒకడు చెపితే చచ్చినా వినిపించుకోడట! పెద్దవాళ్ళంటే గౌరవం, మన్నన అస్సలు లేదుట. ఇంకా కుర్రాడు, వృద్ధిలోకి రావలసినవాడు—అప్పుడు వాడికి అంత అహంకారం చూడండి! నక్క పుట్టి మూడు ఆదివారాలు కాలేదు, వీడు అవినీతి, లంచగొండితనం ఉండకూడదని లెక్చర్లట! అసలు కలక్టరుగారికే తలనొప్పిగా తయారయ్యాట్ట! ఏదో ఓరోజు ఉద్యోగం చెప్పేస్తాడ్లే! ఏ శంకరగిరి మాన్యాలకో, ఇంకో ఏజెన్సీ ఏరియాకో పనిష్మెంట్ ట్రాన్స్‌ఫర్ ఇస్తే అప్పటికి కదుతుంది సంకటం...''

"అది కాదండీ! ఈ పద్ధతులూ అలవాట్లూ అనీ ఆఫీసుల్లో ఏ నాటి నుంచో పాతుకుపోయి వున్నాయికదా, ఇవాళ నువ్వొచ్చి వాటిని తీసిపారేస్తానంటే ఏ తరం అవుతుందా? ఏదో నీ పని నువ్వు చూసుకోకుండా అందర్నీ విమర్శించడమూ, అందరి నోటి ముందు కూడు పడగొట్టడమూ ఎందుకు? అప్పటికి గాని నీకు మెచ్చి మేకతోలు కప్పరు కాబోలు! నిన్న లేదు మొన్న ఉద్యోగంలో ప్రవేశించిన పత్రికాయని కదా, ముప్పయ్యేసి ఏళ్ళూ, పాతికేసి ఏళ్ళూ సర్వీసులు చేసి తలలు పండిపోయినవాళ్ళని విమర్శిస్తావా నువ్వు? పెద్ద పరుగులూ పెద్ద కుండలకి ఎసర్లూనా?'' ఆ అనేదేదో నన్నే అంటున్నట్టు నా మీద ఎగురుతున్నాడు విశ్వేశ్వరంగారు. ఇంతకీ అతని ముందు నోరు విప్పేడో, నోట్లోనే గొణుక్కుని ఇక్కడ నా దగ్గర వల్లిస్తున్నాడో!

"కుర్రాడు కదా ఇంకా! ఆదర్శాలూ అవీ ఉంటాయి'' సముదాయించబోయాను.

"మంచిదేనండీ ఆదర్శాలు ఉండడం! లంచాలు పుచ్చుకోకూడదని, కట్నాలు పుచ్చుకోకూడదని- అన్నీ మంచి మాటలే. కాదనను. కాని కొంచెం పట్టూ విడుపూ ఉండొద్దూ? ముందూ వెనకా చూసుకోవద్దూ? ఒకటే మూర్ఖత్వమా?''

"అయితే పెద్దవాళ్ళు, మీ మాట కూడా ఖాతరు చెయ్యలేదన్నమాట'' అన్నాను నేను.

"వాడికా బుద్ధే వుంటే ఇకనేం? 'ఒరేయ్, ఇవాళ నీ హోదాను చూసి విర్రవీగిపోతున్నావు, దీనికి కారకులెవరో గుర్తుందా? నిన్ను ఐ.ఎ.ఎస్.కి ప్రోత్సహించి పంపింది నేనేనని గుర్తుందా?'' అనడిగితే ఏమన్నాడో తెలుసునాండీ? నాల్లే నందమంది ప్రోత్సహించారుట, వాళ్ళలో నేనొకణ్ణట. అలాగే మరో నందమంది వద్దన్నారట. వాడు ఎవరి మాటా వినకుండా తనకి నచ్చిన పని తను చేశాట్ట! అంటే ఏమన్న మాట? ఇక్కడ నా పెద్దరికమేమీ లేదు, దయ చెయ్యమనేకదూ అర్థం?'' కోపంతో బుసలు కొడుతున్నారు విశ్వేశ్వరంగారు.

"ఇంతకీ ఈ సంబంధం ఎందుకు చేసుకోడట?''

"ఆయన గారికి కట్నం ఇచ్చే సంబంధం వద్దుట. కట్నం లేకుండా ఆదర్శ వివాహం చేసుకుంటాట్ట!''

"మరీ మంచిది. మీకు డబ్బు ఖర్చు తగ్గింది'' అన్నాను నేను.

"ఇంత జరిగాక ఇంకా ఈ బుర్ర తిరుగుడు సంబంధం ఎందుకండీ మనకి! ఆ నలభై యాభై వేలూ పెడితే ఈ మాత్రం సంబంధమరోటి దొరక్కపోదు. లోకం గొడ్డుపోయిందా? ఏదో పెద్ద ఉద్యోగంలో ప్రవేశించాడని ఆశ పడ్డాం గాని, ఇంత స్వతంత్ర భావాలైతే మన పిల్లకి ముద్దూ ముచ్చటా ఏం జరుగుతుందీ? అసలు ఆదర్శమని చెప్పి ఏ కులం లేనిదాన్ని పెళ్ళాడతాడో! మన సంబంధం వాడికి ఎందుకు నచ్చుతుందీ?'' అన్నారాయన.

ఇంకా అనేక విధాలుగా ఈ సంబంధం తప్పిపోవడమే మంచిదని ఊహించి, వాదించి, తను నచ్చచెప్పుకుని, నాకు నచ్చజెప్పి, గ్లాసుడు నిమ్మరసం తాగి వెళ్ళిపోయారు విశ్వేశ్వరంగారు.

అంతసేపూ నేను శ్రోతగానే ఉన్నానుగాని, ఆయనకేమీ చెప్పలేదు—మా ఊరి డిప్యూటీ కలక్టరు శ్రీనివాసరావుకీ, నాకూ పరిచయం పెరిగిందనీ, టెన్నిస్ బంతు లెత్తుతూనో, బ్రిడ్జి కార్డులు వేస్తూనో మేం అనేక విషయాలు మాట్లాడుకుంటామనీ, స్నేహ ధర్మాన్ననుసరించి నేనే అతనికి ఈ సంబంధం విషయమై ఉపదేశించేనని-ఏమీ చెప్పలేదు.

నాకెందుకూ? కాగల కార్యం గంధర్వులే తీరుస్తారు!